విత్తనశుద్ధితో పంటలకు మేలు



ఇబ్రహీంపట్నంలో రైతులతో కలిసి వరి నారుమళ్లు పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న నాగమణెమ్మ

వ్యవసాయశాఖ డీడీ మాదవీలత

ఇబ్రహీంపట్నం: రైతులు వరి పంటను సాగుచేసే ముందు విత్తనాలు శుద్ధి చేయటంతో పాటు నేలలో కర్బన పదార్థాలు పెంచుకోవడానికి జనుము, జీలుగ, పిల్లి పెసర పంటలను పెంచి కలియదున్నాలని డీడీఏ మాధవీలత తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని ఇబ్రహీంపట్నం, వీలప్రోలు గ్రామాల్లో గ్రామీణ విత్తనాభివృద్ధి పథకం కింద గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వరినారుమళ్లను రైతులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ ఒక కేజీ వరి విత్తనాలకు 10 గ్రాముల సుడోమోనాస్ కలపటం వల్ల విత్తనశుద్ధి అవుతుందన్నారు. సెంటు నారుమడిలో 160 గ్రాముల చొప్పున కార్బోఫ్యూరన్ 3జీ గుళికలను కలిపి నారు పీకే వారం ముందు చల్లటం వల్ల నారు గట్టిపడుతుందని తెలిపారు. సమగ్ర సస్య రక్షణ చర్యలు పాటించటం ద్వారా పంటల సాగుకు అయ్యే ఖర్చులు తగ్గుతాయని చెప్పారు. వేప, గానుగ ఆకులతో తయారు చేసిన కషాయాలను జీవ నియంత్రణ పద్ధతులైన సూడోమోనాస్, ఫ్లోరాసెస్ వాడకాన్ని



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ

అలవాటు చేసుకోవాలని తెలిపారు. వాతావరణంలో వచ్చిన మార్పులుకు అనుగుణంగా రైతులు పంటలను మార్పు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ మనీషా, మండల వ్యవసాయశాఖ అధికారి డీ శైలజ, ఏఓ(టెక్నికల్) వాసుదేవ నాయక్, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పత్తి పైరు పరిశీలన

జి.కొండూరు: రైతులు తాము సాగు చేస్తున్న పత్తి పైరు చుట్టూ గట్టులపై కంది లేదా నాన్ బీటీ పత్తి విత్తనాలను నాటడం వల్లన పురుగులు, తెగుళ్లతో పాటు పశువుల నుంచి పంటను కాపాడుకోవచ్చని జిల్లా వ్యవసాయాధికారి నాగమణెమ్మ అన్నారు. మండల పరిధి ఆత్కూరు గ్రామంలో రైతులు సాగు చేస్తున్న పత్తి పైరును స్థానిక ఏఓ రాంకుమార్‌తో కలిసి ఆమె గురువారం పరిశీలించారు. నాగమణెమ్మ మాట్లాడుతూ పత్తి పైరు చుటూ రక్షణ పంట వేసుకోవడం వల్లన పత్తిని ఆశించే గులాబీ రంగు పురుగు ఉద్ధతిని తగ్గించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన ఉత్పతులు విక్రయించాలి

చాట్రాయి: ఎరువుల దుకాణాల్లో నాణ్యమైన ఉత్పతులను అమ్మాలని నూజివీడు డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ విద్యాసాగర్ తెలిపారు. చాట్రాయిలోని రైతు సేవా కేంద్రంలో గురువారం ఎరువుల దుకాణాల డీలర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యా సాగర్ మాట్లాడుతూ షాపుల వద్ద స్టాకు బోర్డు ఏర్పాటు చేయాలని, ఎమ్మార్పీకే పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు అమ్మాలని, బిల్లు ఇవ్వాలని, రిజిష్టర్లు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి బి.శివశంకర్, ఉద్యాన వన శాఖాధికారిణి హేమ, తదితరులు పాల్గొన్నారు.

శ్యామలాంబకు ఆషాఢ సారె



తిరువూరులో శాకంబరీ అలంకారంలో శ్యామలాంబ దర్శనం



గంపలగూడెంలో ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ



అమ్మవారికి ఆషాఢ సారె సమర్పిస్తున్న భక్తులు



గంపలగూడెంలో గ్రామదేవతకు సమర్పించే సారె సామగ్రితో మహిళలు

తిరువూరు: ఆషాఢ మాస సందర్భంగా స్థానిక బస్టాండు సెంటర్లోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్యామలాంబదేవిని వివిధ కాయగూరలతో శాకంబరీ దేవిగా గురువారం అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు రాధాకృష్ణశాస్త్రి ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చనలు చేశారు. దేవదాయ శాఖ మేనేజరు జన్ను వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

గ్రామదేవతకు భక్తిశ్రద్ధలతో సారె

గంపలగూడెం: ఆషాఢమాసం సందర్భంగా గంపలగూడెంలో ముత్యాలమ్మ అమ్మవారికి గురువారం మహిళలు భక్తిశ్రద్ధలతో సారె సమర్పించారు. గ్రామదేవతకు ముందుగా ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం 50 మంది మహిళలు నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులు, పువ్వులు తదితర సారె సామగ్రి అమ్మవారికి సమర్పించారు.

రెడ్డిగూడెం: మండల కేంద్రంలోని రాజగోపాల స్వామి ఆలయంలో అమ్మవారికి భక్తులు ఆషాఢ సారెను గురువారం సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమ, గాజులు, నూతన వస్త్రాలు, పండ్లు, ఫలహారాలు, సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాఘవాచారి భక్తులు పాల్గొన్నారు.

చర్చికి తాళం వేయడంపై గ్రామస్తుల ఆందోళన

ఈలప్రోలు(ఇబ్రహీంపట్నం): ఈలప్రోలు గ్రామంలో సీఎస్ఐ చర్చి వివాదాల మయంగా మారింది. అధికారులు చర్చికి తాళం వేయడంపై సంఘస్తులు గురువారం ఆందోళన చేపట్టారు. గతంలో ఎంపీ, ఎంపీపీ నిధులు, సంఘస్తుల సహకారంతో నిర్మించిన చర్చిని ఇప్పుడు ప్రభుత్వ భవనం అనటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాణాలు తెగించైనా చర్చిని ప్రభుత్వ పరం చేయనీబోయమని స్పష్టం చేశారు. గతంలో గ్రామంలో తలెత్తిన వర్గపోరుతో గ్రామస్థాయి టీడీపీ నాయకులు చర్చి స్థలం, చర్చి నిర్మాణంపై రాజకీయ వివాదానికి తెరలేపారన్నారు. సీఐ ఎం. సత్యనారాయణ అక్కడకు చేరుకుని చర్చి పాస్టర్ బాబురావు, స్థానికులతో చర్చలు జరిపి ఆందోళన విరమింపజేశారు. చర్చి విషయం కోర్టులో తేల్చుకుంటామని పాస్టర్ తెలిపారు. ఈ విషయంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి మహబూబ్ బాషాను వివరణ కోరగా హైకోర్టు ఆదేశాల మేరకు కమ్యూనిటీ స్థలంలో ఉన్న ప్రభుత్వ భవనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.



ఈలప్రోలులో రోడ్డుపై ఆందోళన చేపట్టిన సంఘస్తులు, స్థానికులు

కొత్త చట్టాలు నిలిపివేయాలని ఆందోళన



తిరువూరు కోర్టు ఎదుట ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

తిరువూరు: భారత న్యాయ శిక్షాస్మృతిలోని బీఎన్ఎస్ఎస్, బీఎస్ఎస్ సెక్షన్లను మార్పుచేసి కొత్తగా అమల్లోకి తీసుకొచ్చిన సెక్షన్లను వెంటనే నిలుపుదల చేయాలని కోరుతూ తిరువూరు కోర్టు ఎదుట గురువారం న్యాయవాదులు ఆందోళన చేశారు. నూతన చట్టాలను రద్దుచేసి పాతవి కొనసాగించాలని కోరుతూ జిల్లా బార్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ ఆందోళన జరిపినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకదాని లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణ అందరి బాధ్యత

సీడీపీవో సత్యావతి

గంపలగూడెం: బాల్య వివాహాలను అరికట్టాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ సీడీపీవో సత్యవతి తెలిపారు. గంపలగూడెం కేజీబీవీలో గురువారం మండల ప్రత్యేక అధికారి పి.వెంకటనారాయణ అధ్యక్షతన నిర్వహించిన భేటీ బచావో - భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బ్యాలవివాహాల కారణంగా వచ్చే అనర్థాలను వివరిస్తూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాల్య వివాహం వల్ల వచ్చే నష్టాల గురించి వివరించారు. బాలికల, మహిళల రక్షణకై ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాల గురించి ఆమె తెలిపారు. తహసీల్దార్ సుగుణ, ఎంఈవోలు పీవీ డీఎల్ నరసింహారావు, శ్యామ్ సుందరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మునిలక్ష్మి, కేజీబీవీ ప్రత్యేక అధికారి వెంకటలక్ష్మి, పట్టణ పరిదిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలికలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గంపలగూడెం కేజీబీవీలో మాట్లాడుతున్న సీడీపీవో సత్యవతి

ఉపాధ్యాయ సంఘాల ఆరోపణల్లో వాస్తవం లేదు

ఎంఈఓ–2 కేశవరావు

ఏ.కొండూరు: ఉపాధ్యాయ సంఘాల జేఏసీ తనపై చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని ఎంఈఓ–2 ఈఎల్‌సీ కేశవరావు ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. ఇబ్బందులకు గురి చేస్తున్నానని తనపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆర్డీఓకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్న అంశాల్లో వాస్తవం లేదన్నారు. మండలంలోని పాఠశాలలు తనిఖీలు చేయగా కొందరు ఉపాధ్యాయుల పనితీరు సరిగా లేకపోవడంతో వారికి సమావేశాలు ఏర్పాటు చేసి తగు సూచనలు ఇచ్చానని చెప్పారు. అయినప్పటికీ ఉపాధ్యాయుల్లో మార్పు రాలేదన్నారు. దీంతో లోతుగా పరిశీలించగా కొందరు ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యం వహించడం, ఉదయం హాజరు నమోదు చేసి పని గంటల్లోనే బయటకి వెళ్లిపోవడం వంటి అంశాలు గమనించానన్నారు. విద్యార్థులకు మంచి విద్య అందేలా చూడాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. వ్యక్తిగతంగా, కులపరంగా ఎవ్వరినీ తాను ఇబ్బంది పెట్టలేదన్నారు.

దోమల నిర్మూలనకు ఫాగింగ్

గంపలగూడెం: ప్రస్తుత వాతావరణంలో దోమకాటుతో విషజ్వరాలు ప్రబలే నేపథ్యంలో గ్రామ పంచాయతీ గురువారం నివారణ చర్యలు చేపట్టింది. సర్పంచ్ కోట పుల్లమ్మ ఆధ్వర్యంలో గ్రామంలోని పలు వీధుల వెంట కచ్చా డ్రెయినేజీల్లో పేరుకు పోయిన పూడికను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కూలీల ద్వారా తొలగించారు. మురుగునీరు సక్రమంగా దిగువకు పారేలా చేశారు. మురుగు కాల్వల వెంట బ్లీచింగ్ పౌడర్ చల్లారు. దోమల నివారణకు ప్రత్యేకంగా ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్ల వద్ద మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. పాత సామాగ్రి, వినియోగించిన కొబ్బరిబోండాల్లాంటి వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. గ్రామ పంచాయతీ ఈవో జి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో పారిశుద్ధ్య చర్యలు

లక్ష్మీపురం(తిరువూరురూరల్): అధికవర్షాల కారణంగా వ్యాధులు ప్రబలకుండా గ్రామ పంచాయతీ అధికారులు ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. లక్ష్మీపురం, కొత్త లక్ష్మీపురం, రాయగూడెంలలో మురుగుకాలువలు శుభ్రం చేసి, దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయడం, దోమల నిర్మూలనకు ఎబేట్ పిచికారీ చేశారు. ఇళ్ల ఆవరణలో పేడ, వ్యర్థాలు వేయవద్దని గ్రామస్తులకు పంచాయతీ సర్పంచ్ గొల్లమండల శ్రీనివాసరావు, కార్యదర్శి రవికాంత్ సూచించారు.




గంపలగూడెంలో ఫాగింగ్ చేస్తున్న దృశ్యం



పారిశుద్ధ్య చర్యలు చేపట్టిన పంచాయతీ సిబ్బంది

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



చాట్రాయి: తాటి చెట్టుపై నుంచి పడి చనిపోయిన వ్యక్తి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. మండలంలోని ఆరుగొలను పేటకు చెందిన అంబోజు రమేష్ (25) నాలుగు సంవత్సరాల క్రితం తాడి చెట్టు ఎక్కి కింద పడి చనిపోయాడు. కుటుంబ పోషణ భారం కావడంతో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మండల అధ్యక్షురాలు లింగోజు సరిత ఆధ్వర్యంలో దాతల ద్వారా రూ.16,500 సేకరించి గురువారం మృతుడి భార్య అంబోజు ధనలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ మండల కార్యదర్శి కొమ్ము ఆనందం, తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

ఆగిరిపల్లి: 14 సంవత్సరాల లోపు వయసు పిల్లలు బడిలోనే ఉండి చదువుకోవాలని మండల విద్యాశాఖ అధికారి-2 కొవ్వలి ఆనంద్ కుమార్ అన్నారు. గురువారం బడిబాట కార్యక్రమంలో భాగంగా స్థానిక బస్టాండ్ ఆవరణలో పాఠశాలకు వెళ్లకుండా తిరుగుతున్న బట్టు ఫణి కుమార్ అనే బాలుడి దగ్గర వివరాలు తీసుకొని తల్లిదండ్రులకు నచ్చజెప్పి, బాలుడిని 4వ తరగతిలో చేర్పించారు. హెచ్‌ఎం పుష్పలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం

నూజివీడు: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం జరిగిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు గరిసేపల్లి రాజు అన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని చిన్న గాంధీబొమ్మ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. రాజు మాట్లాడుతూ రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు నుంచి రూ.15 వేల కోట్లు అప్పు ఇప్పిస్తానని చెప్పిందే తప్ప నిధులు విడుదల చేస్తానని చెప్పలేదన్నారు. ఈ మాత్రం అప్పుకే రాష్ట్రంలోని కూటమి నాయకులు సంకలు గుద్దుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఈ బడ్జెట్‌తో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని ధ్వజమెత్తారు. మరో వైపు బీహార్‌కు నితీష్ కుమార్ కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రూ.60 వేల కోట్లు కేటాయించేలా చేశారన్నారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇస్తానన్నారే తప్ప బడ్జెట్‌లో కేటాయించింది శూన్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కలిసి నాటకం ఆడుతూ రాష్ట్రాన్ని నట్టేట ముంచుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైల్వేజోన్, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధులు, రాష్ట్రానికి ప్రత్యేక హోదా వంటివి బడ్జెట్‌లో లేవన్నారు. ఒక్క రూపాయి ఇవ్వకపోయినా వేల కోట్లు కేటాయించినట్లు రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించడానికి కూటమి ప్రభుత్వం విశ్వ ప్రయత్నాలు చేస్తుందని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి చేసి రాష్ట్రానికి నిధులు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి ఎస్ఆర్ హనుమాన్, నాయకులు యెలినేని దుర్గారావు, సందూరి పద్మాంజలి, రామకూరి మరియదాసు, శోభనాద్రి, తదితరులు పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శన చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్‌లు

నూజివీడు: పట్టణంలోని రహదారుల వెంబడి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు, స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌లు రోడ్డుకు ఆనుకొని ఉండటంతో ప్రమాదాలు సంభవిస్తాయని వాహనచోదకులు, పాదచారులు భయపడుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని పట్టణ ప్రజలు వాపోతున్నారు. గతంలో ట్రాఫిక్ కమిటీ సమావేశాల్లో రోడ్ల వెంబడి ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్‌లను తొలగించాలని సభ్యులు పలుమార్లు తీర్మానించినప్పటికీ అవి కేవలం పుస్తకాలకే పరిమితమయ్యాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నెస్పీ గేటు వద్ద, ఎల్ఐసీ కార్యాలయ రోడ్డు ప్రారంభంలో రోడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లు అయితే మరీ ప్రమాదకరంగా ఉండటంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా ఉంటోంది. ఎల్ఐసీ కార్యాలయం వైపు నుంచి వచ్చే వాహనాలు ప్రధాన రోడ్డు పైకి వచ్చేటప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో పెద్ద గాంధీబొమ్మ సెంటర్ వైపు నుంచి వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చేవరకు కనిపించడం లేదు. దీంతో ఒక్కోసారి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అలాగే ఎన్నెస్పీ కాలనీ వైపు పలు ప్రైవేట్ స్కూల్స్ ఉండటంతో స్కూల్ బస్సులు రాకపోకలు సాగించాలంటే మలుపులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేవు. అలాగే జంక్షన్‌రోడ్డులో ఎస్‌బీఐ వద్ద, అప్సర్ థియేటర్ వద్ద, సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద, ధంధం గార్డెన్‌లో, తేలప్రోలు ఎస్టేట్ సమీపంలో, ఎస్ఆర్ఆర్ హైస్కూల్ గేటు పక్కన ఇలా అనేక చోట్ల ప్రధాన రహదారుల వెంటే రోడ్డును ఆనుకొని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లతో ఎలాంటి ముప్పు ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. తేలప్రోలు ఎస్టేట్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ అయితే ట్రాఫిక్‌కు సైతం అంతరాయంగా ఉంది. వాహనాలు అదుపుతప్పి వాటిని ఢీకొంటే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు ఈ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఎవరికి ఇబ్బంది లేని చోట్ల ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



ఎల్ఐసీ కార్యాలయ రోడ్డు మలుపులో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

మధ్యాహ్న కార్మికురాలు పద్మ తొలగింపు అన్యాయం

రెడ్డిగూడెం: మండలంలోని కుదప గ్రామంలో మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పనిచేస్తున్న పద్మను విధుల నుంచి తొలగించడం అన్యాయమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుధాకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు తెలిపారు. హైస్కూల్‌ను గురువారం సందర్శించి భోజన కార్మికురాలు పద్మతోపాటు ఉపాధ్యాయులతో మాట్లాడారు. స్థానికంగా ఉన్న ఉపాధ్యాయుడు గోపాలరావు అనే వ్యక్తి టీడీపీ నాయకుడిలా మాట్లాడుతూ వాళ్ల అధికారంలో ఉన్నప్పుడు వారిని పెట్టారు, ఇప్పుడు టీడీపీ అధికారంలోకి వచింది గనుక పద్మను తొలగించి కొత్తవారిని పెడుతున్నామంటూ మాట్లాడటం అత్యంత దారుణంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు రాజకీయ నాయకులుగా గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ గొడవలకు దారితీస్తున్నాయని చెప్పారు. తక్షణమే ఉపాధ్యాయుడిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భోజన కార్మికురాలు పద్మను తక్షణమే కొనసాగించాలని కోరారు. ఈ విషయంపై ఎంఈఓ జోక్యం చేసుకోవాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు పజ్జూరి సాయి పద్మ పాల్గొన్నారు.



కుదప హైస్కూలు వద్ద మాట్లాడుతున్న సుధాకర్





ఇటీవలే కురుస్తున్న వర్షాలకు కొండపల్లి ఖిల్లా పచ్చదనంతో కళకళలాడుతోంది. ఇక్కడి కోట పరిసరాలు ఆహ్లాదకరంగా మారాయి. ఎటు చూసినా పచ్చగా కనపడుతోంది. చెట్లతో అందంగా కనిపిస్తున్న రహదారి ఉన్న దృశ్యాలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్లుప్తంగా

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్



ఇబ్రహీంపట్నం: ఉపాధి హామీ పథకం పనులు సద్వినియోగం చేసుకోవాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ జె.సునీత తెలిపారు. ఇబ్రహీంపట్నం ఎంపీపీ కార్యాలయంలో మండలస్థాయి ఉపాధి హామీ పనుల సోషల్ ఆడిట్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులు పారదర్శకంగా జరిగేలా సంబంధిత అధికారులు చూడాలని కోరారు. 10 గ్రామ పంచాయతీల్లో చేసిన పనుల సోషల్ ఆడిట్ నివేదిక చదివి వినిపించారు. ఇప్పటి వరకు నిర్వహించిన ఆడిట్ లెక్కల ప్రకారం కొలతల్లో తేడాలు, నిధుల దుర్వినియోగంపై ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రికవరీకి ఆదేశించారు. ఎంపీడీవో ఉమాదేవి, డీపీవో విజయ లక్ష్మీ, ఏపీవో అప్పారావు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జాన్‌బీకి సీఐటీయూ నివాళి



దొనబండ(ఇబ్రహీంపట్నం): దొనబండ గ్రామంలో ఆశావర్కర్‌గా పనిచేస్తున్న షేక్ జాన్‌బీ (58) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యానికి గురై చికిత్స తీసుకుంటున్నారు. ఆరోగ్యం విషమించడంతో తుదిశ్వాస విడిచారు. జాన్‌బీ మృతదేహాన్ని సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్ సందర్శించి నివాళులర్పించారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు సమాంతరంగా స్కీమ్ వర్కర్‌గా పనిచేసిన జాన్‌బీ కుటుంబానికి ప్రభుత్వం రూ.2లక్షల పరిహారం, మట్టి ఖర్చులు అందించాలని డిమాండ్ చేశారు.

ఏఐపై అవగాహన

ఇబ్రహీంపట్నం: భవిష్యత్తు మొత్తం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ మీదే ఆధారపడి ఉంటుందని డేటా వ్యాలీ సంస్థ టెక్నికల్ హెడ్ టి. సాంబశివరావు తెలిపారు. ఇబ్రహీంపట్నం నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఒక రోజు కెరియర్ కౌన్సెలింగ్ అవగాహనలో భాగంగా సెమినార్ నిర్వహించారు. డేటా వ్యాలీ టెక్నికల్ హెడ్ సాంబశివరావు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ప్రాముఖ్యతను వివరిస్తూ దీనిలో ప్రావీణ్యం సంపాదిస్తే మంచి వేతనంతో జీవితంలో స్థిరపడవచ్చన్నారు. సదస్సులో మార్కెటింగ్ మేనేజర్ కె.నరసింహరాజు, కళాశాల ప్రిన్సిపాల్ అక్బర్‌ఖాన్, ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అజయ్ పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ

తిరువూరురూరల్: మండలంలోని చౌటపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామస్తులు తల్లపురెడ్డి బసివిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రాజశేఖరరెడ్డి ఇనుప బీరువా వితరణ ఇచ్చారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బీరువాను ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌కు అందజేశారు.

నేడు ఆధార్ ప్రత్యేక శిబిరాలు

నూజివీడు: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆధార్ ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ శిబిరాలను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారన్నారు. మీర్జాపురం, మర్రిబంధం, సిద్ధార్థనగర్, వెంకటాయపాలెం సచివాలయాల్లో ఆధార్ శిబిరాలను నిర్వహిస్తారన్నారు. ఆధార్‌లో అడ్రస్ మార్పు, బయోమెట్రిక్ అప్‌డేట్, పేరులో సవరణలు, చిన్నపిల్లలకు నూతన ఆధార్ తదితర సేవలను అందిస్తారన్నారు. శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కనిపించని ఆధార్ ప్రత్యేక శిబిరాలు

ఆగిరిపల్లి: మండలంలో ఇప్పటివరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలు ప్రారంభం కాలేదు. ఈ నెల 24 నుంచి 27 వరకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉచిత ఆధార్ సేవలు ప్రారంభమైన మండలంలో 4 ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసినా ఇప్పటి వరకు ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేయలేదు. మండలంలో ఈదర, నరసింగపాలెం, చొప్పరమెట్ల, వడ్లమను లో గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసిన డిజిటల్ అసిస్టెంట్లు లేకపోవడంతో ఇప్పటివరకు అధికారులు ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేయకపోవడంతో మండలంలోని ప్రజలకు ఆధార్ సేవలను ఎక్కడ పొందాలో తెలియని పరిస్థితిలో ఉన్నారు. ఎంపీడీవో శామ్యూల్‌ను వివరణ కోరగా నాలుగు ఆధార్ సేవ కేంద్రాల్లో డిజిటల్ అసిస్టెంట్లు అందుబాటులో లేరని జిల్లా అధికారులకు సమాచారం అందించామని, త్వరలోనే ఆధార్ కేంద్రాలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలి

ముసునూరు: మండలంలోని కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలని మండల వ్యవసాయాధికారి సందిపాము మధుమోహన్ బ్యాంకర్లను కోరారు. మండలంలోని చెక్కపల్లిలో ఎస్‌బీఐ అక్కిరెడ్డిగూడెం బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్‌కు స్థానిక రైతులతో కలిసి, కౌలు రైతుల జాబితాను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది 1598 కౌలు కార్డుల జారీ లక్ష్యం కాగా, 823 కార్డులు పంపిణీ చేశామన్నారు. కౌలు రైతులకు రుణాలు మంజూరు చేసి సహకరించాలని బ్యాంకర్లను ఆయన కోరారు.